తాపత్రయం
--నిడదవోలు మాలతి
(ఆంధ్రజ్యోతి అదివారం సారస్వాతానుబంధం, డిశంబర్ 13, 25, 1969-70 ప్రాంతాల్లో ఋణానుబంధం పేరున ప్రచురితం)

పక్కింటి రేడియోలోంచి ఏయం రాజా కాబోలు పాడుతున్నాడు ''నల్లని మీసం తెల్లబారినా చిల్లర కోర్కెలు చావవురా...'' తను మీసాలే ఉంచలేదు. అందుకే తనకు కోరికలే లేవనుకున్నాడు. చలిగాలికి పొడి ఆరిపోయిన పెదవులు కించిత్ చలించాయి నవ్వే యత్నంలో. ఒక నిట్టూర్పు వెలువడింది అప్రయత్నంగా. ఎందుకు తనకీ ఆవేదన?

కపిలతీర్థం రోడ్ మీద కొంచెంసేపు తిరిగివస్తే మనసు కుదుట పడుతుందేమో అని షర్టు వేసుకుని బయల్దేరాడు. వెనక్కి వస్తూ కోదండస్వామి ఆలయంలోకి తొంగి చూసాడు. పూలంగి సేవ కాబోలు జనం ధ్వజస్థంభం వరకూ బారులు తీర్చి వున్నారు. నిన్న మొన్నటి వరకూ అమ్మ ''గుడికి వెళ్లరా'' అంటే సరేనని బయల్దేరి సింహద్వారం దగ్గిర ఆగిపోయేవాడు ఎవరో పగ్గాలేసి లాగినట్టు. ''అదేమిరా'' అంటే ''చెప్పులు పోతాయేమోన''ని అనేవాడు. ఇవాళ ఏశక్తి తన్నిటు నడిపిస్తోంది? కొళాయి దగ్గిర కాళ్లు కడుక్కుని ప్రదక్షిణం చేశాడు. గుడి వెనకవేపు ఇద్దరు కుర్రాళ్ళు హలంత శబ్దాలు వల్లిస్తున్నారు. బాగా మాసిన అంగవస్త్రం కట్టుకు, నీటుగా పట్టెవర్ధనాలు తీర్చి దిద్దిన వైష్ణవ కుర్రాడు స్థంభం పట్టుకు ఊగుతూ ''మైకంలో ఉన్నాను మన్నించాలి'' పాడుతున్నాడు. ఎవరో ఒక వృద్ధురాలితో వచ్చిన మూడేళ్ల పసిపాప అతనిమొహంలోకి చూసి సిగ్గు పడుతూ ఆవిడచాటుకి వెళ్లిపోయింది. శంకరం అప్రయత్నంగా చిరునవ్వు నవ్వాడు. ఆ ఇద్దరి మొహాలూ చూసి ఆవిడా నవ్వింది. ఒక్క క్షణం స్నిగ్ధ మాధురి పారిజాతాల పరిమళంలా గుప్పుమంది. అది మరో ప్రపంచం! ... అక్కడ కల్పకం ఉంటుంది.

బాధగా అతని హృదయం మూలిగింది. కల్పకం ఎవరు కనక? ఇంటబుట్టిన తోబుట్టువా? కలిసి ఆడుకున్న బాల్య స్నేహితురాలా? వరసైన మేనత్త కూతురా? ఏదీ కాదు...

అటువేపు మంటపం దగ్గర ఒక స్వామి వేదాంతం బోధిస్తున్నాడు, ''జగత్ మిథ్య. మమకారాలు పతనానికి నాంది. కోరికలు చంపుకోండి. క్షణికసుఖాలకు లొంగిపోయి శాశ్వతమైన పరమపదం వదులుకోరాదు. నిత్యమైన శాంతి లభించేది నిశ్చల గుర్వంఘ్రియుగ్మ గత చిత్తములకు...''

శంకరం గుండె తడుముకున్నాడు. అది అక్కడ నిశ్చలంగా స్థగితమై ఉంది. అప్రతిష్ఠ. ఎవరైనా వింటే ఏవగించుకుంటారు.

''సంసారబంధం తప్పించడానికి యత్నించేకొద్దీ బిగుసుకునే ఉచ్చు. అది తప్పించుకోగలిగినప్పుడే మోక్షం. గ్రహించుకోండి. ఎవరూ ఎవరికీ ఏమీ కారని తెలుసుకోండి. మనిషి పుట్టినప్పుడు ఏకాకి. మరణించినప్పుడు ఒంటరిగానే మరణిస్తాడు. ఎవరూ వెంట రారు--భార్య, తల్లి, బంధుమిత్రులు.. ఎవరూ శ్మశానం దాటి రారు.''

శంకరం లేచి గర్భగుడివేపు నడిచాడు. దర్శనం ఇస్తున్నారు. కోదండరామస్వామి దివ్యమంగళవిగ్రహ దర్శనంతో ఒక్కక్షణం మనసు పరవశించింది. ఏబాధలూ, భయాలూ శోకని పవిత్ర ప్రదేశం అది. రాజసం ఉట్టిపడే ఆరాతిబొమ్మ ''నీ కెందుకీ తాపత్రయాలు'' అని ప్రశ్నించినట్టనిపించింది. అభయహస్తం, వరదహస్తం, కరుణారస సమన్విత సుందర వదనారవిందం ''నేనుండగా నీకెందుకీ ఆవేదన?'' అన్నట్టనిపించింది. అప్రయత్నంగా చేతులు జోడించాడు, ''ప్రభూ! కల్పకం సుఖించాలి''

వెనక్కి తిరిగి ఇంటికి వచ్చేశాడు. అన్నం తినాలనిపించలేదు. హోటల్‌కి వెళ్లాలనిపించలేదు. పడుకుంటే నిద్ర పట్టలేదు. కల్పకం తన్ని నించోనియ్యడం లేదు, కూచోనియ్యడం లేదు. తీర్చలేని ఋణంలా పీక్కుతింటోంది. కల్పకం తనకేవ.తుందని తనింత బాధ పడాలి? కల్పకం తనకేమీ బాకీ లేదు. ఎలాంటి

ప్రమాణాలూ చెయ్యలేదు. ...

కల్పకాన్ని చూసి ఎనిమిదేళ్లవుతోంది.

తన వయసు ఐదుపదులు దాటింది.

ఇంతవరకూ తనకేమీ అక్కర్లేదనే అనుకున్నాడు.

''నేను పెళ్లి చేసుకోను. నాకు అక్కర్లేదు,'' అని తను మొరాయిస్తే, ''మరి నీకేం కావాలిరా?'' అని ప్రశ్నించిన తల్లికి జవాబు చెప్పనేలేకపోయాడు. అయినా పెళ్లికి ఒప్పుకోలేదు.

''ఉన్న భవబంధాలు తెంచుకోండి అని వేదాలూ, ఉపనిషత్తులూ ఘోష పెడుతూంటే, కొత్తవి సృష్టించుకోడం ఎందుకమ్మా'' అంటూ వచ్చాడు. అప్పట్లో  తనకి ఎటు చూచినా అర్థం కాని జీవితమే కనిపించేది-- కొత్త టెర్లిన్ షర్టు కుట్టిస్తే గాని స్కూలికెళ్లనని గోల పెట్టిన రవణ, డిసెంబరు పరీక్షల్లో తనకంటె పది మార్కులు ఎక్కువొచ్చినందుకు, పేపరు చూపెంచరా అంటే చుక్కల్లోకి చూస్తూ నడిచిపోయిన రవణ-- టిటెనస్ జొరంతో ఇరవై నాలుగ్గంటలు తిరక్కుండా చచ్చిపోయాడు. వాడి టెర్లిన్ షర్టు, మార్కులు, పొగరుగా చిన్న వాళ్లని చావగొట్టే గుణం ఏవీ వాడి ప్రాణం కాపాడలేదు. ఇప్పుడవన్నీ అర్థరహితంగా కనిపిస్తున్నాయి. పరీక్ష పాసయిన వాళ్ల లిస్టులో వాడిపేరూ పడింది. ఆస్పత్రిలో వాణ్ణి చూడ్డానికి వెళ్తే ''ఆఁ.. ఆఁ.. '' అంటూ వాడు ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తూంటే తనకి కడుపులో దేవినట్టయింది. ''ఇంతేనా?'' అనిపించింది. నిలబడలేక గిరుక్కున తిరిగి వచ్చేశాడు. ఇంటికొచ్చి తల్లిని పట్టుకు బావురుమని ఏడ్చేశాడు.

''ఇంకెప్పుడూ అలా ఆస్పత్రికెళ్లకు'' అంటూ చీవాట్లేసిందావిడ!

చిరాగ్గా ఉందని షర్టు విప్పి కుర్చీమీదకి విసిరేశాడు. కల్పకం తాలూకు స్మృతులు కూడా ఇలాగే విసిరేయగలిగితే...

టేబులుమీద కల్పకం రాసిన కార్డు పడివుంది. తాను మద్రాసు వెడుతున్నానని, వీలైతే గూడూరు స్టేషనుకి రమ్మని అరవంలోనే రాసింది. తనకి అరవం అంతగా రాదు. ఒక తమిళ సోదరుడిని పట్టుకు చదివించుకున్నాడు. తరవాత తనే కూడబలుక్కుంటూ మళ్లీ మళ్లీ చదువుకున్నాడు. ఏమిటో ఈ పిచ్చి... మాగన్నుగా కునుకు పడితే కల్పకం కళ్లలో మెదిలింది.

ఎనిమిదేళ్ల క్రితం స్వంతపనిమీద ఢిల్లీ వెళ్తున్నాడు తను. కల్పకం రైల్లో కనిపించింది. స్లీపరుకోచిలో ఎదురుసీటుమీద పట్టుమని పాతికేళ్లేనా లేని కల్పకం, ఆరేళ్ల కొడుకుని గుండెల పొదువుకుని బిక్కు బిక్కుమంటూ దిక్కులు చూస్తున్న కల్పకాన్ని చూస్తే తనకి జాలేసింది. అప్పట్లో జాలి అనే అనుకున్నాడు తను. బెజవాడ స్టేషనులో అడిగాడు కాఫీ కావాలా అని. కాఫీ అన్న మాట అర్థం అయిందేమో, హార్లిక్స్ సీసా, డబ్బులూ తీసిచ్చింది, కళ్లతోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ. ఇంకేమేనా కావాలా అన్నాడు ఒకింత చిరాకుగానే. నోరు విప్పి మాటాడదేం?

''తెలుంగు తెరియాదు'' అంది.

తనే వచ్చి రాని అరవం మాటాడి, కుర్రాడికి మాత్రం ఓ సాంబారు పొట్లం తీసుకొచ్చాడు. ఆ తరవాత మాటల్లో తెలిసింది--ఆ అమ్మాయికి పెళ్లయి ఏడేళ్లయింది. తండ్రి ఏదో చిన్న హోటలులో కాలం గడుపుకుంటున్నాడు. ఇద్దరు అన్నగార్లు యస్సెల్సీ వరకూ చదువుకుని ఉద్యోగాల్లో ప్రవేశించారు. ఏడేళ్ల క్రితం తిరుత్తని గుళ్లో కనిపించిన వాడికి కట్టబెట్టాడు ఈపిల్లని. శోభనం రోజున చూసిన చూపులే, అతడు మళ్లీ కనబడ లేదు! ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాట్ట. ఎప్పుడో తోచినప్పుడు ఓ ఉత్తరం రాస్తాట్ట– ఇంకా ఇల్లు దొరకలేదనీ, దొరికినప్పుడు రాస్తాననీ రాస్తాడు. గత ఏడేళ్లలోనూ మూడుత్తరాలు రాసాడు. సరసుడే! తనకి కోపమే వచ్చింది. ''వాడు మనిషేనా?'' అన్నాడు రూక్షణంగానే, తెలుగులోనే.

''ఎన్నా?'' అంది కల్పకం అసలే పెద్దవైన కళ్లు ఇంకా పెద్దవి చేసి.

''పెన్న '' అన్నాడు తను విసుగ్గా.

''ఇప్పుడు ఏధైర్యంతో వెళ్తున్నావు?'' అంటే, ''ఇల్లు దొరికింద''ని ఉత్తరం వచ్చిందిట. అయితే మాత్రం ఇలా ఒక్కదాన్ని పంపించేస్తారా? కళ్లయెదుట లేని తండ్రిమీద కోపం తెచ్చుకున్నాడు. ఈపిల్లకి చూస్తే నోట్లో నాలుక ఉన్నట్టు లేదు. అరవం తప్ప మరో భాష రాదు. పెళ్లినాడు చూట్టమే తప్ప ఆ మొగాడి మొహం మళ్లి చూడలేదు. గుర్తయినా పట్టగలదో లేదో? ఒక్కదాన్ని ఇలా పంపడం ఎంత సాహసం?

''అప్పా వరతుకు పైసా ఆహుం'' అంది కల్పకం.

''ఓహో'' అన్నాడతను వేళాకోళంగా. మళ్లీ తనకే సిగ్గేసింది. తనలా ఏ బాధ్యతలూ లేకుండా తిరిగేవాడి దారి లేరు. నాలుగు వేళ్లూ నోట్లోకి పోవడానికి ఏపూటకాపూట తడుముకునేవారి దారి వేరు. రాను పోను ఎంత లేదన్నా నూరు రూపాయలవుతుంది. ఎక్కడినించి వస్తాయి? అప్పిచ్చేవాడయినా తిరిగొచ్చే విధానం చూసుకుని కదా ఇస్తాడు.

''నువ్వు వొస్తున్నట్టు ఉత్తరం రాసావా?'' అంటే తలూపింది. అంతే.

మర్నాడు తను మీల్సు టికెట్ తీసుకుంటూ, కల్పకానికీ, ఆ కుర్రాడికీ కూడా రెండు కొన్నాడు. కల్పకం ఒణ్ణు పోరుం అంది కాని వొద్దనలేదు. ఒకింత చిరాకు కలిగింది క్షణంలో సగంసేపు. మరో గంట గడిచేసరికి కుర్రాడు తనతో చనువుగా కబుర్లు చెప్పడం ప్రారంభించాడు. వాళ్ల మంచిచెడ్డలు చూడవలసిన బాధ్యత అంతా స్వయంగా స్వీకరించాడు.

ఇప్పుడు ఆలోచిస్తే అదొక సినిమాలాగా, తానొక ప్రేక్షకుడిలాగా అనుభూతి కలుగుతోంది. అప్పట్లో అదంతా సహజంగానే అనిపించింది. కాదు, ఇదేమిటి, అన్న సందేహం తనకి కలగనేలేదు. ''అమ్మాయిని అత్తవారింటికి దిగబెడుతున్నావా?'' అని అడిగిన ముసలావిడకి అవునని సమాధానం ఇచ్చాడు, ఆ ప్రశ్నలో ధ్వనిస్తున్న అభిప్రాయాలు ఆలోచించకుండానే.

''టికెట్ ప్లీజ్,'' అని టికెట్ కలెక్టరు అడిగినప్పుడు తనే కలగజేసుకున్నాడు. కలగజేసుకోవలసివచ్చింది. కల్పకం తండ్రి కుర్రాడికి కొనాల్సిన అరటికెట్టు కొనకుండా రైలెక్కించేశాడు. కల్పకం తనకేమీ తెలీదంది ఏడుప్మొహం పెట్టి. తల్లిని చూసి కొడుకు బావురుమన్నాడు. ఈ పాటకచేరీ ఏవంత రసవత్తరంగా లేదేమో టికెట్‌కలెక్టరు మాత్రం ఎక్సెస్ కట్టమని మొండికేశాడు. ఉద్యోగరీత్యా నెలకి ఇరవై రోజులు రైల్లోనే గడుపుతాడతను. ఇలాటి సంఘటనలు చాలానే చూశాడతను. తనకి మాత్రం కల్పకం కథ నిజమే అనిపించింది. అందుచేత టికెట్‌కలెక్టరుకి కనీసమర్యాదలమీద ఘాటుగా లెక్చరిచ్చి, కుర్రాడి టికెట్ డబ్బులిచ్చి, తన హృదయవైశాల్యాన్ని, సిసలైన హైందవసాంప్రదాయాన్ని ఋజువు చేశాడు.

''ఆ అమ్మాయికీ నీకూ ఏమిటి సంబంధం'' అని అప్పట్లో ఎవరేనా అడిగితే ''మనిషికీ మనిషికీ ఉన్న సంబంధమే'' అని ఉండేవాడు. ''నేను ఇవాళ ఈ ఆడకూతురిని ఆదుకుంటే రేపు మరొకరు మా ఆడవారిని కానుకుంటారు'' అని ఉండేవాడు చనువుగా ఉన్నవారైతే తమాషాకి. ...

హఠాత్తుగా శంకరం ఉలిక్కిపడ్డాడు. ... తన ఆడవాళ్లు... తనమటుకు తనకే విచిత్రంగా ధ్వనించిందా మాట.

కల్పకం దగ్గిర అతని ఆఫీసు ఎడ్రెస్ ఉంది గాని ఇంటి ఎడ్రెస్ లేదు. పంజాబీ పిండివంటలు కల్పకానికి పడవని, మద్రాసీ హోటలుకి తీసికెళ్లి, భోజనం పెట్టించి, ఆ తరవాత వాళ్లని వాళ్ల హోటలులో దింపి, తను ఆ భర్తగారి ఆఫీసుకి బయల్దేరాడు. పెద్ద పెద్ద పట్టణాల్లో ఒకరి గురించి మరొకరు చెప్పగలిగింది చాలా తక్కువ. ''ఫలానా వాడిల్లెక్కడ?'' ''వాడికి పెళ్లయిందా?'' మొదలైన విషయాలంతగా ఎవరూ పట్టించుకోరు. శంకరం ఆఫీసు కనుక్కోగ లిగాడు కాని ఆ మొదలియారుని కనుక్కోలేకపోయాడు. శంకరం కనిపించిన ప్రతివాణ్ణీ ''నీకు ఫలానా మొదలియార్ని తెలుసా?'' అంటూ అడుక్కుంటూ పోతే ఆఖరికి ఒకడు చెప్పాడు అతను రెండు రోజులుగా కనిపించడంలేదని. ఎందుచేత అంటే తనకి తెలీదనీ, వాళ్ల బాస్‌కి తెలియొచ్చనీ చెప్పాడు. ఆ బాస్‌ని పట్టుకునేసరికి మరో రెండు గంటలయింది. ఆఖరికి తెలిసింది ఆ మొదలియార్ ఆఫీసుపనిమీద

కలకత్తా వెళ్లాడనీ, తిరిగొచ్చేసరికి వారంరోజులు పడుతుందనీ. ఆవార్త మోసుకుని సాయంత్రం ఆరుగంటలకి హోటలుకి చేరుకున్నాడు. కల్పకం ఆర్నెల్లుగా జొరపడ్డట్టుంది, తను తీసుకొచ్చిన మాట విని మూర్ఛపోతుందేమో అనుకున్నాడు. అలా మూర్ఛ పోయినా, హోరుమని గుండెలు బాదుకుంటూ ఏడ్చినా ఏం చెయ్యాలో తనకి తోచలేదు.

తీరా శంకరం సంకోచిస్తూ అసలు విషయం చెప్పినపుడు కల్పకంలో ఏవిధమైన చలనం కనిపించలేదు. శంకరానికి ఒక విధంగా కోపమే వచ్చింది. ''వారం రోజులు ఎక్కడ ఉండడం? ఇప్పుడేం చెయ్యడం?'' అన్న ప్రశ్నలే ఆ అమ్మాయికి తోచినట్టు లేదు. అదేదో సినిమాలో హీరోయిన్‌లా రూం అంతా కదం తొక్కుతే కొడుకు ఫక్కుమని నవ్వేశాడు. శంకరానికి మరీ ఒళ్లు మండింది. కాని ఏం చేస్తాడు? నోరూ వాయీ లేని ఈ అర్భకురాలినీ, వేలెడు పసివాడినీ ఈ అడవిలాటి ఊళ్లో ఒంటరిగా వదలిపోవడానికి మగతనపు అహంభావం ఒప్పలేదు.

మర్నాడు మళ్లీ ఆఫీసుకి వెళ్లి కలకత్తాలో ఎడ్రెస్ తీసుకుని ఒక టెలిగ్రాం ఇచ్చాడు--రాజధానిలో కల్పకం దిగినట్టు. అది అందగానే ఆ భర్త రెక్కలు కట్టుకు వచ్చి ఢిల్లీలో వాల్తాడు అన్న అభిప్రాయంతో. అలా చేసి వచ్చానని చెప్పినప్పుడు కల్పకం ''సరి'' అంది. అంతే. శంకరానికి మళ్లీ కోపం వచ్చింది. అలా మళ్లీ మళ్లీ కోపం తెచ్చుకుంటూ, విసుక్కుంటూ, రుసరుసలాడుతూ, వారం రోజులు గడపవలసివచ్చిందతనికి. కల్పకం భర్త రానేలేదు. కల్పకం మాత్రం ఇదంతా నీఖర్మ అన్న ధోరణిలో నిశ్చింతగా ఉంది. వారంరోజుల్లోనూ కుర్రాడు బాగా చేరిక అయిపోయాడు. వాడి కాలక్షేపం కోసం, మరేం చెయ్యాలో తెలీకా, శంకరం వాళ్లిద్దర్నీ రోజూ ఊరంతా తిప్పుతున్నాడు అవుతున్న ఖర్చు చూసుకోకుండా. ఒకమారు మాత్రం అంత డబ్బే అంది బిల్ చూసి.

''మరి లేకపోతే ఏమిటనుకున్నావు. ఇలాటి పట్టణానికి మద్రాసునించి మూడురూపాయల్తో దిగావు. నేను చూడబట్టి సరిపోయింది. లేకపోతే ఏమయేదో తెలుసా? హుం. నిన్నని ఏం లాభం. మీనాన్న ననాలి'' అన్నాడు శంకరం విసురుగా.

కల్పకానికి అర్థం అయిందో లేదో, జవాబు చెప్పలేదు.

ఆ వారంరోజులూ మొదలియారు ఆఫీసు చుట్టూ తిరగడం అతడి విధ్యుక్త ధర్మం అయిపోయింది. ఆఖరికి ఎనిమిదోరోజున మొదలియార్ దిగాడు. కాలరు పుచ్చుకు ఊచి పుచ్చుకు లెంపకాయ కొడదాం అన్న కోరిక తీరకుండానే జరిగింది వివరించాడు. అంతా విని ''ఐ హేవ్ రిటన్ టు హర్ దట్ ఐ విల్‌బి గోయింగ్ టు కల్కటా'' అన్నాడు భర్తగా తన ధర్మం నిర్వర్తించిన తృప్తితో..

''హుః'' అన్నాడు శంకరం అసంతృప్తిగా. ''అదే నేనైతే... '' అనుకున్నాడు--జరగనిది ఊహించుకుని ఆనందించే మనస్తత్త్వంతో.

ఆసాయంత్రం మొదలియార్ ఆఫీసునుంచి వస్తూ దారిలో కల్పకాన్ని, కొడుకుని, సామానుతో సహా టాక్సీలో ఎక్కించి, ''థాంక్సెలాట్'' అన్నాడు. కుర్రాడు మాత్రం శంకరంచెయ్యి పట్టుకు లాగుతూ రమ్మని మారాం మొదలెట్టాడు. టాక్సీలోకి సామాను మోసి అలుపు తీర్చుకుంటున్న శంకరం ఒక్క ఊపున వాడిని ఎత్తుకుని రెండు బుగ్గలమీదా ముద్దు పెట్టుకున్నాడు. మళ్లీ అంతలోనే దింపేసి, టాక్సీవేపు ఒక్క తోపు తోసి, టాటా చెప్పేసి, రూంలోకి వెళ్లిపోయాడు. రూంలో అడుగెట్టగానే ఏమిటో బోసిగా అనిపించింది.

ఇంటబుట్టిన ఆడబడుచుని అత్తవారింటికి పంపిస్తుంటే ఇలాగే అనిపిస్తుంది కాబోలు అనుకున్నాడు... కానీ... ... కానీ ఎదలో ముల్లయి తగుల్తున్నది... అదేమిటో తెలీడం లేదు. .. కల్పకం మాటవరసకైనా మీరూ రండి అనలేదు. ఒక్కపూట వచ్చి వాళ్లింట్లో ఆతిథ్యం స్వీకరించవలసింది అని అర్థించలేదు. శంకరానికి ఉవ్వెత్తున కోపం వచ్చింది. ఆడవాళ్లందరూ అంతే. మగవాళ్లంతా తమ సేవకోసమే పుట్టినట్టు పనులు చేయించుకుని అమాయకంగా మొహం పెట్టేసి చోద్యం చూస్తూ నిలబడిపోతారు.

మొదలియారు మాత్రం ఇంటి ఎడ్రెసిచ్చి ''వీలైనప్పుడు రండి'' అని చెప్పి వెళ్లిపోయాడు.
''ఎంత లక్షణంగా ఉందీ పిలుపు'' అనుకున్నాడు తను రూక్షణంగా.

రెండు రోజులనాడు తన పనంతా అయిపోయాక టికెట్ కొంటుంటే కల్పకాన్ని చూడకుండా ఢిల్లీ వదలడం కష్టం అని తట్టింది. ఈ రెండురోజుల్లోనూ తనేం చేస్తున్నా, ఏం మాటాడుతున్నా నేపథ్య సంగీతంలా కల్పకం నీడ ఎదలో మెదుల్తుంటే అదంతా అలవాటున పొరపాటనీ, కర్ర వంకర నిప్పు తీర్చినట్టు దైవం గీచిన గీటు కాలమే చెరుపుతుందనీ అనుకున్నాడు.
అందుకే తప్పేముంది పది రోజుల సాహచర్యం. ఒక్కమారు చూసి రావాలని, కాపురం ఎలా ఉందని అడగాలనీ ఎవరికి మాత్రం అనిపించదు.. కల్పకం తండ్రికి తను వివరాలన్నీ చెప్పొచ్చు కూడాను, పైగా ఆవిడ అన్నగారైతే వెళ్లడా... అంటూ శతవిధాల తనకి తనే నచ్చ చెప్పుకుంటూ, అలా నచ్చ చెప్పుకోవలసిన అగత్యం ఏమీ లేదనుకుంటూ వాళ్ల యిల్లు చేరుకున్నాడు.
తను అక్కడికి చేరేసరికి, కల్పకం, కొడుకు నీటుగా ముస్తాబయి బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నారు. తన్ని చూడగానే ''మామా, మామా'' అంటూ కుర్రాడు పరిగెత్తుకుంటూ వచ్చాడు. కల్పకం సందిగ్ధంగా ''రండి'' అంది గుమ్మానికి అడ్డంగా నిలబడి. సినిమాకి వెడుతున్నారుట. మొదలియారు లోపలినించి వచ్చి హలో అని, కమిన్ అనేలోపల, శంకరమే మాటాడాడు−−సినిమాకి వెళ్తున్నారు కాబోలు, వెళ్లండి, నేను రాత్రి డీలక్స్‌లో ఊరికి పోతున్నాను. చూసి పోదామని వచ్చాను, అన్నాడు, తనకోసం ఎవరూ బెంగ పెట్టుకోలేదని గ్రహించినవాడై.
మొదలియారు కొంచెం ఆలోచించి, ''మీరు కూడా సినిమాకి వస్తే బాగుండేది. కాఫీ అయినా ఇవ్వలేదు'' అన్నాడు.
శంకరం ఫరవాలేదని చెప్పేసి అక్కడినించి వచ్చేశాడు. అతనికి జీవితంలో మొదటిసారిగా తనమీద తనకే చిరాకు కలిగింది. తన మనసు దేనిని ఎదురు చూసిందో, తానెందుకు నిస్పృహ చెందాలో తనకే అర్థం కాలేదు.

శంకరం లేచి, షర్టు వేసుకుని, వీధిన పడ్డాడు. బజారులో అప్పుడే దిగిన ఆపిల్ పళ్లు చూడగానే గుళ్లో పాప జ్ఞాపకం వచ్చింది. ఒక్క క్షణం మనసు రెక్కలు విప్పుకుంది. ఒక పండు కొని, జేబులో వేసుకుని, గుడివేపు నడిచాడు. తన్నెవరో తోసినట్టయి, పడబోయి నిలదొక్కుని చూసేవేళకి, రిక్షా ముందుకి సాగిపోయింది. తనే ఎన్నోమార్లు అనుకున్నాడు−−ఈవూళ్లో రిక్షావాళ్లు గంట కొట్టరు, కొట్టినా ప్రజలు వినిపించుకోరు, అంచేత వీలైనంతవరకూ రిక్షావాడు తనే రిక్షాని తప్పిస్తూ, వీలు కానప్పుడు తనే జనాల్ని చేత్తో పక్కకి తోసేస్తూ సాగిపోతాడు అని. అలా తోసినందుకు జనాలు కోపగించుకోరు కూడాను. ఇవాళ తనకీ అదే మర్యాద జరిగింది. అయినా ఇంత చిన్న విషయం తనలో ఇంత పరధ్యానం, అంతకు రెట్టింపు చైతన్యం తీసుకురావడమే విచిత్రం!!! ఆపాప కోసం తనకెందుకింత ఆతృత?
జవాబు దొరకలేదు. ఆ పాప తనదగ్గిరకి రాకపోతే? తానిచ్చిన పండు తీసుకోకపోతే? తనే తింటాడు. అవును. ఆ పసిదానిమీద తనకెలాటి మమకార వికారాలూ లేవు. ఈక్షణంలో భగవంతుడు ప్రత్యక్షమై ''నీకేం కావాలి? కోరుకోమం''టే, తను... శంకరం గుండెలమీద చెయ్యేసుకున్నాడు. ఆలోచించకూడదు. కూడని ఆలోచన వచ్చినప్పుడు అణచివేయాలి. అతను నడక వేగం హెచ్చించాడు. ...
ఇవాళ పాప రాలేదేమో!
లేదు. వస్తుంది. రోజూ వస్తుంది. పదిహేను రోజుల్నించీ చూస్తున్నాడు. రోజూ వస్తోంది.
ఇవాళ ఆ ముసలావిడ కాకుండా మరెవరైనా పడుచుపిల్ల వస్తే?
అయితే మటుకేం? తనేం తప్పు చేయబోవడం లేదే! తనేం కొట్టబోతాడా? తిట్టబోతాడా? పసిపిల్ల చేతిలో ఓ

పండు పెడితే తప్పేం?

కాదు. చూసినవాళ్లేం అనుకుంటారు?

పైగా ఆ పడుచావిడకి తెలియకపోవచ్చు అసలు కారణం. అపార్థం చేసుకోవచ్చు. అవును. అందుచేత ఆ పండు తీసుకు రూమ్ కొచ్చేసి...

పాపని చూస్తుంటే ఎక్కడో చూసినట్టు అనిపిస్తుంది. ఎందుకనో? చాలా ఆత్మీయురాలిలా అనిపిస్తుంది. మళ్లీ కల్పకం పోలికలు కూడా లేవు. కల్పకం మొహం కోలగా వుంటుంది. పాప మొహం గుండ్రంగా ఉంటుంది. కల్పకం నలుపు. పాప గులాబీ రంగు. పెద్ద బుగ్గలు, నవ్వితే ఆ బుగ్గలమీద చక్కని సొట్టలు పడతాయి. ...

ఛీ.. ఏమిటీ వెర్రి? తను ఎంతమంది ఆడపిల్లల్ని చూడలేదు? ఎంతమంది ఆడపిల్లల తండ్రులు తనకి వలలు పన్నడానికి ప్రయత్నించలేదు? అంతమందిని తప్పించుకుని అలవోకగా నవ్వుకున్న తను... తనకిప్పుడు ఎందుకింత తాపత్రయం ఒక్క మనిషి పట్ల? ఎందుకీ తలమునకలు?

కల్పకం మాటవరసకైనా భోజనానికి రమ్మనలేదు. కాఫీ అయినా ఇవ్వలేదు. ఐదు నిముషాలపాటు నిలబడి మాటాడే ఓపిక లేనట్టు ప్రవర్తించింది.

''ఒకరికి పెట్టడానికి చేతులాడవు'' అని టైటిలు పుచ్చుకున్న తను వెనకా ముందూ చూడకుండా చేతినున్న రిస్టువాచీనించి తెగనమ్మి ఖర్చు పెట్టి, అరవ చాకిరి చేశాడు ఆపిల్లకి. తను ఏనాటి ఋణమో వసూలు చేసుకుంటున్న మార్వాడీలా చూస్తూ నిలబడి పోయింది--తనేదో మహారాణీ అయినట్టు, అతనేమో భృత్యుడైనట్టూ సేవలు చేయించుకుంది. అంతేకాని ''నువ్వెంత మంచివాడివి'' అని మాట మాత్రం అన్లేకపోయింది. ...

శంకరం గుడి చేరేసరికి అప్పుడే తెర తీశారు. క్యూలో కూలబడిన జనాలు మెల్లగా లేవసాగారు. అంతసేపూ అటూ ఇటూ పరుగులు పెడుతున్న పిల్లలు పెద్దలదగ్గిరికి చేరుతున్నారు. శంకరం కళ్లు పాప కోసం వెతకసాగాయి. క్యూలో ముందున్నారు వాళ్లు కాబోలు దర్శనాలు, ప్రదక్షిణాలు ముగించుకుని వస్తున్నారు ఇద్దరూ. శంకరం ఒకడుగు అటేసి పాపని పిలిచాడు. పాప గుర్తు పట్టినట్టు నవ్వి, అవ్వ చాటుకి వెళ్లిపోయింది. అధ్యాత్మరామాయణకీర్తన పాడుకుంటున్న వృద్ధురాలు కూడా అతన్ని చూసి నవ్వింది. శంకరం కూడా నవ్వుతూ జేబులో వున్న ఆపిల్ పండుతీసి ఇంద అన్నాడు పాపతో. పాప ఆ పండువేపు ఆశగా చూస్తూ ఒంటికాలిమీద నిలబడి అవ్వ చాటునించి చూడసాగింది. ఆవిడ పాపని ముందుకి తోసి తీసుకో అంది. పాప ఇంకా ముడుచుకుపోయింది.

''కొత్త కదా, సిగ్గు,'' అందావిడ. శంకరం కూడా కాదండీ మరి అంటూ తనే మరో అడుగు ముందుకేసి పండు చేతికందించాడు.

''ఎక్కడ మీయిల్లు?'' అంది వృద్ధురాలు మాట కలుపుతూ.

శంకరం సగం సగం నట్టుతూ జవాబులు చెప్పి, పాప బుగ్గమీద చిన్న చిటిక వేసి, ముందుకు సాగుతున్న క్యూలో కలిసిపోయాడు.

అరాత్రి అతడి మానసికాశంలో సన్నని, అతిస్వల్పమైన వెలుగురేఖ పొడమింది. ఒక దివ్యానుభూతితో అతడి మనసు మూగవోయింది.

అప్పట్నుంచీ రోజూ గుడికి వెళ్లడం, పాపకి పిప్పరమెంట్లో బిస్కట్లో ఇవ్వడం అలవాటు చేసుకుంటున్నట్టు శంకరం అనుకోలేదు. తాను యదాలాపంగానే పిప్పరమెంట్లు కొంటున్నట్టూ, కాలక్షేపానికే గుడికెళ్తున్నట్టు, గ్రహపాటునే పాప తనకి తారసపడుతున్నట్టు నమ్మాడు. ఒకరోజు పాపతో వృద్ధురాలు కాక ఒక గృహిణి వచ్చింది. మరొకరోజు పాప రాలేదు. ఆ రెండు రోజులు ఛాతీ దగ్గిర ఎడంవేపు కొంచెం నొప్పెట్టింది. ఎందుకో అతనికి అర్థం కాలేదు. రెండోరోజు రాత్రి తనమీద తనకే చిరాకేసింది...

తృళ్లిపడ్డాడు....

నిజమేనా?

ఇలా పడుతూ, లేస్తూ

తన కన్నీళ్లు తనే తుడుచుకుంటూ...

పొరపాటు పడుతూ,

తిరగ రాసుకుంటూ ... ఎంతకాలం? ...

అప్పుడూ ఇంతే...

ఇంతే అయింది.

తను క్షణం తరవాత క్షణం, రోజు తరవాత రోజూ, నెల తరవాత నెలా ఎదురుచూశాడు. కల్పకం తప్పకుండా ఉత్తరం రాస్తుందనుకున్నాడు. ఆవిడ రాయవలసిన ఉత్తరాలు తనే కంపోజు చేసుకున్నాడు.

కల్పకం రాయలేదు. కాకమ్మ చేతనైనా కబురంపలేదు తన క్షేమం గూర్చి.

శంకరం భరించలేకపోయాడు. భరించడం తప్ప మరేం చేయలేకపోయాడు.

లజ్ కార్నర్‌లో నిలబడి, సిగరెట్ మీద సిగరెట్ కాల్చాడు.

పాండీబజారులో వరసగా హోటల్ తరవాత హోటల్‌కి వెళ్లి కప్పు మీద కప్పు కాఫీ తాగాడు.

సాయంత్రం నాలుగు గంటలకి కొంచెం కళ్లు తిరిగినట్టనిపించింది. హైహీల్సు టకటకలాడించుకుంటూ సాగిపోతున్న ఓ ఆంగ్లో యిండియన్ యువతిమీద తూలిపడ్డాడు. ఆవిడ ''యూ బ్రూట్'' అని కసిరి, గౌను మడతలు సరి చేసుకుంటూ పక్కకి తప్పుకుంది.

ఛీ! ఏమిటీ వెర్రి? శంకరం టాక్సీలో గదికి చేరుకుని మంచంమీద కొరిగాడు.

మర్నాడు మధ్యాన్నానికి మనసు కొంచెం తేలిక పడ్డట్టనిపించింది. కాని మళ్లీ ఒక అరగంటయినా కాకుండానే, ఏమీ తోచకపోవడం మొదలయింది. పత్రిక తీసినా, పేపరు చూసినా, ఆఖరికి శంకర్స్ వీక్లీలో కార్టూన్లు కూడా నవ్వించ లేకపోయాయి. ...

తనని తనే తిట్టుకున్నాడు. కల్పకం తనకేమవుతుందని తనింత బాధ పడాలి? ఆమె తనకేవిధమైన వాగ్దానాలూ చెయ్యలేదు. అసలింతా చేస్తే తనకీ కల్పకానికీ వున్న పరిచయం ఏపాటిది కనక? ఎవరైనా వింటే నమ్ముతారా? నవ్వుతారు. ఈ కాకమ్మ కబుర్లు నాదగ్గిర చెప్పకంటారు. కాని తన వ్యాకులతకు కారణం కల్పకమేనని మనసు పదేపదే చెబుతోంది...

శంకరం క్రమంగా నీరసించిపోయాడు. కళ్లలో కాంతి తరిగింది. పరిచయస్థులు ''ఏం? ఒంట్లో బాగులేదా?'' అని పరామర్శలు చేయడం మొదలెట్టారు. ఆప్తులు ''అలా అయిపోతున్నావేమిటి?'' అంటూ సానుభూతి వెలిబుచ్చుతున్నారు. స్నేహితులు ''క్షవరం చేసుకోవడం మానేశావేమిటి?'' అనడుగుతున్నారు. ''తిరపతి మొక్కా?'' పృచ్ఛించారు ఇంకోరు.

''అవును'' అన్నాడు శంకరం. అని తిరపతి బస్ ఎక్కేశాడు.

కొండమీద నెలరోజులున్నాడు. అతడి కళ్లకి అదొక ప్రపంచంగా భాసించింది. కల్యాణకట్ట దగ్గర తన కేశసంపదతోపాటు అనేకానేక యాతిబాధల్ని కూడా దులిపేసుకుని ''అమ్మయ్య'' అనుకునే జనాల్ని చూస్తుంటే, తనకి తెలియకుండానే కాళ్లు అతన్ని అటువేపు తీసుకుపోయాయి. ఆక్షణంలో ఎవరైనా ఎదురుపడి, ''అదేమిటి? నీకు ఇటువంటి బాహ్యాడంబరాలలో నమ్మకం లేదు కాబోలునే'' అంటే, ''ఆఁ! ఏ సెలూనయితేనేం... '' అని ఉండేవాడు మనసు కాదంటున్నా. కానా ఆ క్షణంలో అతని చేత అలా అబద్ధం పలికించడానికి అక్కడెవరూ లేరు.

గోవిందనామాలు స్మరిస్తూ పుష్కరిణిలో మునకలేస్తున్న జనాన్ని చూస్తూ తనూ ఓ మునుగు ములిగాడు. తిరిగి తిరిగి ఆలయ ప్రాంగణంలో అడుగు పెడుతుంటే క్రమంగా మనసులోని తమసు

విచ్చిపోతున్నట్టనిపించింది. కొంచెంసేపు మండపంలో కూచున్నాడు. చీమ గంగాయాత్రలా సాగుతున్న క్యూను చూస్తూ. ఎప్పుడో ఎక్కడో చదివిన గీతం జ్ఞాపకం రాసాగింది.

చిన్నిపదం కన్నెపదం

చిట్టిపదం పాట్టిపదం

పాపిపదం పరమపదం

సరిగ్గా నేర్పరి అయిన నటిపాదాల్లాగ అంత లయబద్ధంగా ఎలా కూర్చగలిగాడో! ... అతని దృష్టి గోపురంవేపు మళ్లింది.

ఎగసి ఎగసి ఏసీమల చేర్చునవో

ఎగసి ఎగసి ఏదర్శనమిచ్చునవో...

గోవిందా! గోవిందా!

శంకరం తృళ్లిపడ్డాడు. ఒక్క క్షణం క్రితం కలిగిన దివ్యానుభూతి జన్మజన్మాల మరువలేనిది.

శంకరం హఠాత్తుగా మారిపోయాడు. సూట్లు, సిగరెట్లు, కాఫీ--అన్నీ మానేశాడు. తిరపతిలోనే స్థిరపడిపోయాడు. వ్యాపారం నామమాత్రం అయిపోయింది. స్నేహితులూ, చుట్టాలూ–అందర్నీ వదిలేశాడు. ''క్షేమం తెలియజేస్తూ ఓకార్డుముక్క రాసి పడెయ్యరా దౌర్భాగ్యుడా!'' అంటూ వృద్ధురాలైన తల్లి ఏడుస్తూ రాసిన పది పేజీల ఉత్తరం ముక్కలు ముక్కలుగా చింపేసి, ''ఈనాటితో ఈబంధం కూడా సరి'' అనుకున్నాడు.

సంవత్సరాలు గడుస్తున్నాయి. ఒకరూ ఒకరూ స్నేహితులు కూడసాగారు. కదాచితుగా సినిమాలు చూస్తున్నాడు. ఒకొక్క సినిమాలో ఒక హీరోయిన్ ఆడిన మాట, చూసిన చూపు కల్పకాన్ని జ్ఞప్తికి తెస్తే, శ్మశాన వైరాగ్యంలాటి ''తెలుగు సినిమా వైరాగ్యం'' కలిగి, ఇక సినిమాలకి వెళ్లకూడదు అనుకున్నాడు. బిక్కు బిక్కుమంటూ తనని చూసిన తమిళ పడుచు కల్పకానికీ, పసితనపు అమాయకత్వంతో నవ్వులు వెదజల్లుతున్న ఈ తెలుగు పసిపాపకీ ఎక్కడా పోలికలు లేకపోయినా, ఎందుకో పాపని చూస్తే తన మనసు రంజిల్లుతూంది.

''ఏమిటి భగవాన్?'' అని ఎప్పుడేనా అనుకున్నా, మళ్లీ అప్పుడే మరిచిపోతున్నాడు.

తనని సందుమలుపులో చూస్తూనే ''మామా, మామా'' అంటూ చేతులు చాచి పరుగెత్తుకు వచ్చే పాపని ఎగరేసి పట్టుకు హృదయానికి హత్తుకుంటాడు. తన చెంపకి పాప చెంప ఆనిస్తే పాప మూతి గుండ్రంగా పెట్టి ''గుత్తుకుంతూంది'' అంది ఓసారి, చేతుల్లోంచి జారిపోతూ. శంకరం నవ్వుతూ గడ్డం తడుముకున్నాడు. రెండురోజులైంది క్షవరం చేసుకుని. అక్కడ్నుంచీ సొంతక్షవరం దినచర్య అయిపోయింది. పాపని చూడని రోజు అతడికి శిక్ష. అప్పుడూ అప్పుడూ మద్రాసు వెళ్లివస్తున్నాడు. వచ్చినప్పుడు పాపకి ఏదోఒకటి తేకుండా ఉండడం లేదు. పాప తల్లిదండ్రులు మొదట్లో ఒప్పుకోకపోయినా, తరవాత్తరవాత అదొక సామాన్యమైన విషయంగా ఊరుకున్నారు. ఒకొకప్పుడూ ఏ పార్కుకో, సినిమాకకో కూడా తీసుకెళ్తున్నాడు.

అర్జెంటుపనిమీద మద్రాసెళ్లి రెండురోజులు ఆలస్యంగా వచ్చాడు. రైలు దిగుతూనే నేరుగా ఆలయానికి వెళ్లాడు. పాపకానీ పాపతో వచ్చే అవ్వ కానీ కనిపించలేదు. వాళ్ల పక్కింటి కుర్రాడు కనిపించి, పాపకి రెండురోజుల్నించీ జ్వరంగా ఉందని చెప్పాడు. శంకరం చేతిసంచీతో ఉన్నపాళంగా ఉరుకులూ పరుగుల్తో వాళ్లిల్లు చేరుకున్నాడు. అతన్ని చూస్తూనే పాప మామా అంటూ కాళ్ల చుట్టేసింది. శంకరం వంగి పాపని ఎత్తుకుని హృదయానికి హత్తుకున్నాడు. కళ్లు చెమ్మగిల్లేయి. ''ఏనాటి ఋణానుబంధమో'' అనిపించింది పాప తండ్రికి. పాపని అతని చేతుల్లోంచి తీసుకోడం కష్టమే అయింది. ఆయన శంకరానికి నచ్చజెప్పి బలవంతాన ఇంటికి పంపించాడు కొంచెం విశ్రాంతి తీసుకుని రమ్మని. ...

గదికొచ్చి తాళం తీసేసరికి కల్పకం రాసిన కార్డు కనిపించింది. గుండెలమీద ఎవరో బలంగా తన్నినట్టయింది. షర్టు వేసుకుని గబగబా నాలుగు వీధులు పిచ్చిగా తిరిగాడు. కోదండరామస్వామి ఆలయానికి వెళ్లాడు. సెకండుషో సినిమాకి వెళ్లాడు. రాత్రి రెండుగంటలకి ఇల్లు చేరి పక్కమీదకొరిగాడు...

పొద్దున్న తొమ్మిదయింది లేచేసరికి. టేబుల్‌మీది కార్డు గాలికెగిరి కిందపడి ఉంది. తీసి బల్లమీద పెట్టాడు. ఓగంట తరవాత శంకరం నీటుగా ముస్తాబయి, స్కూటరెక్కి గూడూరు బయల్దేరాడు. ''పాపం. ఆడపిల్ల. చూడాలని ఉందని రాసింది. ఒకమారు చూసి వస్తే ఏం పోయింది. తను మాత్రం ఇన్నాళ్లూ ఉత్తరం రాయలేదేం అని అడక్కూడదు. అసలు తను ఏమీ మాటాడడు. కుర్రాడికి మాత్రం పళ్లు పట్టుకెళ్లాలి. ఇప్పుడెంత పెద్దవాడై ఉంటాడో.. వాడి తరవాత ముగ్గురు పిల్లలని రాసింది. అవును మరి. ఎనిమిదేళ్లు! పాస్ట్ ఈజ్ పాస్ట్ అని ఎవరేనా ఎలా అనుకోగలరు?

అర్థం లేనిమాట. గతం ఎప్పుడూ వెన్నంటే ఉంటుంది. లేకపోతే ఖచ్చితంగా మర్చిపోయాడనుకున్న కల్పకం తన్నిలా ముక్కున తాడోసి లాక్కెళ్లగలదా? ...

అబ్బో! గూడూరు తిరపతికి దూరదే!

అందరూ రైళ్లు ఆలస్యంగా వస్తాయంటే తను నమ్మలేదు కాని నిజదే

అయినా... లాల్‌బహదూర్‌శాస్త్రి రాజీనామా చేసింతరవాత కూడా ఇవి బాగుపడలేదూ, హచ్చెర్యమ్...

శంకరం చిర చిరలాడుతూ అడిగే ప్రశ్నలకి ఏయస్సెమ్‌కి విసుగేసింది.

''చూడండి సార్. ఢిల్లీనించి మద్రాసు పోయేబండి ఇట్నుండే వస్తుంది. మీకు కాచుకునే ఓపిక లేకపోతే ఈపట్టాలంటే నడిసిపొండి. బిత్రగుంటకాడ క్రాసింగవుతారు'' అన్నాడతను.

''ఆహా! అలాగా!'' శంకరం అంతకంటె రోషంగా.

కల్పకం వళ్లు చేసింది. ఓచాయ కూడా వచ్చింది. ఆడపిల్లలు యిద్దరూ తండ్రి పోలిక. చిన్నవాడు మాత్రం తల్లిమూసలో పోసి తీసినట్టున్నాడు. వాడి అల్లరి పట్టశక్యం కాకుండా ఉందిట. తండ్రితో ఆఫీసుకి బయల్దేర్తాట్ట. అన్నతో స్కూలికి పోతానంటాట్ట. ఆడపిల్లలు ఆడుకుంటుంటే వాళ్ల బొమ్మలు వీధిలోకి విసిరేస్తాట్ట.

శంకరం నవ్వి ''పిల్లలంతే మరి'' అన్నాడు.

''వీడిమాదిరి రాక్షసుణ్ణి ఎక్కడా చూడలేదు'' అంది. ఆవిడ తెలుగు నేర్చుకుంది. ఇరుగు పొరుగు అంతా తెలుగువాళ్లేనట. హిందీ కూడా వచ్చేసిందిట. తను చాలా గడుసుదనం నేర్చుకుందని అతను దెప్పుతుంటాట్ట. ఆయనకి ప్రమోషనొచ్చిందిట. క్వార్టర్సు కూడా ఇచ్చార్ట. తను కూడా ఉద్యోగంలో చేరాలనుకుంటోందిట. అక్కడ అందరూ చాలా మంచివాళ్లుట. తను లేకపోతే ఆయనకి నిండా కష్టం అయిపోతుందట. అందుకే ఇన్ని దినాలు ఇంటికి పోలేదట. ఇప్పుడు తండ్రికి సీరియస్‌గా ఉందని తెలిసి వెడుతోందిట. తనకి తండ్రి ఈ పెళ్లి చేసినప్పుడు అందరూ తండ్రిని హింస పెట్టార్ట ఎక్కడో వేలమైళ్ల దూరంలో ఉన్నవాడికిచ్చి చేస్తున్నావు అని. ఇప్పుడు చూస్తే అందరూ నిండా సంతోషం అవుదురు అంది. ''అప్పా సేసింది ఎప్పుడూ నల్లదే అవును'' అంది.

రైలు కదిలింది. మద్రాసువేపు సాగిపోతున్న బండిని చూస్తూ నిలబడిపోయిన శంకరాన్ని ''అదేవిట్రా? అలా వున్నావు?'' అని ఓ పాత స్నేహితుడెవరో పలకరించేవరకూ తెరుకోలేదు. ''ఏమిటి సంగతి? మాయమైపోయావు. చాలా చిక్కిపోయావు. జబ్బు పడ్డావేమిటి?'' అంటున్న మిత్రుడ్ని వెర్రిగా చూశాడు శంకరం. కల్పకం ఒక్కమాట కూడా అలాటిమాట అనలేదు! అతనికి భయమేసింది మరొక నిముషం అక్కడుంటే బావురుమని ఏడ్చేస్తాడేమోనని.

''ఏం లేదు. మళ్లీ కలుస్తాలే'' అని విదిలించుకుని వచ్చి స్కూటరు దగ్గర నిలబడితే పాప జ్ఞాపకం వచ్చింది. ఎలా వుందో? అసలు రాత్రే తనని వదిలిపెట్టలేదు. .. మళ్లీ తనకోసం అడిగితే? ... ఒకవేళ జొరం

ఎక్కువైవుంటే... ప్రమాదిస్తే...

స్కూటరు స్టార్టు చేసి, ఒక్క వుదుటున ఎగిరి కూచుని ముందుకి తోశాడు. ... తొందరగా... ఇంకా తొందరగా... ఇంకా.. ఇంకా... తొందరగా... పాపకి ఎలా ఉందో...

పిచ్చి స్పీడుతో పోనిస్తున్న స్కూటర్ని ట్రాఫిక్ కానిస్టేబులాపాడు. "ఏఁవిటయ్యా చూస్తే చదువుకున్నవాడిలా వున్నావు. ట్రాఫిక్రూలూ గట్రా ఏమీ లేవూ?" అంటూ...

(End)